క్లుప్తంగా

నేడు లోక్ అదాలత్

తెనాలిరూరల్: తెనాలి కోర్టుల ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ జరుగనుందని, కక్షిదారులు సద్వినియోగపర్చుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.మాలతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం నాలుగు బెంచ్‌లు ఉంటాయని పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అదాలత్ జరుగుతుందని న్యాయమూర్తి తెలిపారు.

క్యాన్సర్ బాధిత మహిళకు ఆర్థిక సాయం



తెనాలి: వైకుంఠపురం రోడ్డు వద్ద నివసిస్తున్న పఠాన్ మున్ని అనే మహిళకు తెనాలి రోటరీ క్లబ్ రూ.25,500 ఆర్థిక సాయం అందజేసింది. కొంతకాలంగా గొంతు క్యాన్సర్‌తో బాధపడుతున్న మున్ని వైద్య చికిత్సకు సాయం కోసమని రోటరీ క్లబ్‌కు విజ్ఞప్తి చేసింది. క్లబ్ సభ్యులు అందించిన సహకారంతో నగదును శుక్రవారం క్లబ్ అధ్యక్షుడు జెట్టి శివరామకృష్ణ ప్రసాద్, జీవీ నారాయణ ఆమె నివాసంలో అందజేశారు.

మొక్కజొన్న, జొన్న పంటల పరిశీలన



తెనాలిటౌన్: రూరల్ మండలంలోని ఐతా నగర్, తేలప్రోలు, చినరావూరు గ్రామాల పరిధిలో అకాల వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న, జొన్న పంటలను శుక్రవారం జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు, అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్ర సిబ్బంది వీఆర్వోలతో కలసి పంట నష్టం అంచనా వేస్తున్నారని, 33శాతం మించి పంట నష్టపోతే రైతుల పేర్లు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఈ జాబితాలను ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఆర్బీకేల్లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్, ఏఈఓ మోహన్, ఆర్బీకేల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కళాకారుడు శ్రీనివాసరావుకు సన్మానం



తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో శుక్రవారం దేశోద్ధారకులు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. అనంతరం పౌరాణిక నాటక కళాకారుడు దేశబోయిన శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, సోమవరపు నాగేశ్వరరావు, పెమ్మసాని పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

మారనున్న కొల్లిపర రూపురేఖలు

- సీఎం వైఎస్ జగన్ హామీ మేరకు..నిధులు విడుదల
- వేగవంతంగా డ్రెయినేజీలు, సీసీ రోడ్ల నిర్మాణం
- నియోజకవర్గంలో 80 సచివాలయాలకు రూ.16కోట్లు మంజూరు
- కొల్లిపర మండలాభివృద్ధిపై ఎమ్మెల్యే అన్నాబత్తుని సమీక్షా సమావేశం



అభివృద్ధి పనులపై అధికారులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

కొల్లిపర: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇటీవల తెనాలి పర్యటనలో భాగంగా..ఇచ్చిన హామీలతో త్వరలో కొల్లిపర రూపురేఖలు మారనున్నాయని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులు, అధికారులతో గ్రామాల అభివృద్ధిపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు జరిగిన, జరగాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. స్థలాలు అవసరమైన ఎస్సీ కాలనీల శ్మశానవాటికల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ .. దావులూరు అడ్డరోడ్డు నుంచి కొల్లిపర వరకు రూ.10 కోట్లతో రోడ్డు, డివైడర్, సెంట్రల్ లైటింగ్, రూ.5 కోట్లతో ప్రధాన రహదారి వెంట మినీ మార్కెట్ యార్డు ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని తెలిపారు. త్వరలో నిర్మాణ పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. రైతుల కోరిక మేరకు కొల్లిపర గ్రామానికి కృష్ణా నది కరకట్టకు అనుసంధానంగా శిథిలావస్థలో ఉన్న రేపల్లె కాల్వపై వంతెన పునఃనిర్మాణానికి రూ.4కోట్లు మంజూరైనట్లు తెలిపారు.

బిల్లుల విషయంలో అపోహలొద్దు..

తెనాలి నియోజకవర్గంలో 80 సచివాలయాలకు సుమారు రూ.16కోట్ల నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే చెప్పారు. ఈ నిధులతో పాటు.. 14, 15వ ఆర్థిక సంఘం నిధులతో వేగవంతంగా సీసీ రోడ్లు, డ్రెయినేజీలు పూర్తి చేయటం జరుగుతుందన్నారు. సీసీ రోడ్లు, డ్రెయినేజీ, సచివాలయ భవనాల నిర్మాణాలు పూర్తి చేసిన వారికి వెంటనే బిల్లులు మంజూరు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. కాంట్రాక్టర్లు ఎలాంటి అపోహలు పెట్టుకోకుండా పనులు పూర్తి చేయాలని భరోసానిచ్చారు. నిర్మాణ సమయంలో ఎలాంటి సమస్యలున్నా.. తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరించి, నిధులు జమ అయ్యేలా తన వంతు కృషి చేస్తాని హామీ ఇచ్చారు. సీనరేజీ గ్రాంటుతో రైతులకు ఉపయోగకరంగా ఉండాలని సీఎం వైస్ జగన్ ఆదేశాల మేరకు డొంక రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందన్నారు. అభివృద్ధి పనులకు మండలంలోని ప్రజలు సహకరించాలని కోరారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి, తెనాలి మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ అవుతు సీత, తహసీల్దారు జి.నాంచారయ్య, ఇన్‌చార్జి ఎంపీడీఓ చంద్రమోహన్, మండల ఉపాధ్యక్షులు 1, 2 బొల్లిముంత పోతురాజు, అద్దంకి బోసుబాబు, వైసీపీ మండలాధ్యక్షులు ఆరిగ చంద్రారెడ్డి, భీమవరపు సంజీవరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ వెంకటరావు

కొల్లిపర: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని ఎంపీపీ భీమవరపు పద్మావతి పేర్కొన్నారు. శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పి.శ్రీనివాసులు అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గత మూడు నెలల ప్రగతి, ప్రతిపాదనలను శాఖల వారీగా అధికారులు వివరించారు. ఏడీఏ వెంకటరావు మాట్లాడుతూ ఆర్బీకేల్లో రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు జనుము, పిల్లిపెసర ఇస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే మొక్కజొన్న, పసుపు పంటను ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించారు. ఇందుకు రైతులు ఆన్‌లైన్‌లో పంట నమోదు చేసుకోవాలని చెప్పారు. ఎంపీపీ పద్మావతి మాట్లాడుతూ సర్వ సభ్య సమావేశంలో చర్చకు వచ్చిన సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు 1, 2 బొల్లిముంత పోతురాజు, అద్దంకి బోసుబాబు ఎంపీపీడీవో శ్రీనివాసులు, తహసీల్దారు జి.నాంచారయ్య, ఈఓపీఆర్డీ సమతవాణి, ఏడీఏ కె.వెంకటరావు, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పేదల ఇంట ఆనందం నింపడమే సీఎం ధ్యేయం

'గడప గడపకు' కార్యక్రమంలో ఎమ్మెల్యే శివకుమార్



ఎమ్మెల్యే శివకుమార్ ఎదుట సంతోషం వ్యక్తం చేస్తున్న వృద్ధుడు

తెనాలిరూరల్: పేదల ఇంట ఆనందం నింపడమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని గురువారం తెనాలి మండలం పెదరావూరు గ్రామంలోని ఎస్టీ కాలనీ, రెడ్ల పాలెంలో నాలుగో రోజు నిర్వహించారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, సంబంధిత అధికారులతో కలసి గడప గడపకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. సంక్షేమ లబ్ధిని వివరించారు. స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేదలు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. ఇంటింటికీ వెళ్తుంటే.. ప్రజలే ఈ విషయాన్ని తెలియజేస్తున్నారని చెప్పారు. తెనాలిలో గత ప్రభుత్వం వరకు 13 వేళ ఇళ్ల స్థలాలను పేదలకు పంపిణీ చేస్తే.. తన హయాంలో 27 వేల నివేశన స్థలాలు మంజూరు చేసినట్లు తెలిపారు. పెదరావూరులోని వైఎస్సార్ జగనన్న కాలనీ ఎదుట ఎకరం ప్రస్తుతం మార్కెట్ ధర రూ.1.80 కోట్లు ఉందన్నారు. వెంచర్ వేసి ప్లాట్ల విక్రయిస్తున్నారని చెప్పారు. జగనన్న కాలనీ వచ్చాకే.. రెండేళ్లలో పొలం ధరలు పెరిగాయని, పేదలకు ఇచ్చిన స్థలాలు సెంటు సుమారు రూ.10 లక్షల వరకు ఉందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రూ. 2 కోట్లతో 'నాడు–నేడు' పథకం కింద పెద రావూరులోని పాఠశాలలను అభివృద్ధి చేసినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదలు విలువైన ఆస్తిని పొందడంతో..పాటు ఆర్థికంగానూ అభివృద్ధి చెందుతున్నారని చెప్పారు. నియోజకవర్గంలోని అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడటానికే 'గడప గడపకు' కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఎస్టీ కాలనీలో రోడ్డు, అంగన్వాడీ సెంటర్ ఏర్పాటు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేశారని, త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే వెంట గ్రామ సర్పంచ్ కాకి రమాదేవి, ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కుదరవల్లి శంకరరావు, కాకి మనోజ్, గోరికపూడి బాలరాజు, రావూరి విజయ్ ఉన్నారు.

సినీ నటి టీనా చౌదరికి సత్కారం



టీనా చౌదరిని సత్కరిస్తున్న నిర్వాహకులు

తెనాలి: వర్ధమాన సినీ నటి, కూచిపూడి నర్తకి మన్నె టీనా చౌదరికి జన్మస్థలి సత్కారం జరిగింది. స్థానిక అమరావతి ప్లాట్స్‌లోని స్విమ్ అండ్ ఫన్ ఆడిటోరియంలో శుక్రవారం జెట్టి విజయశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటైన సభకు డాక్టర్ గిరిధర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి సినీ దర్శకుడు దిలీప్‌రాజా మాట్లాడుతూ టీనా భారత ఉప రాష్ట్రపతి, మిజోరాం, కర్ణాటక, తమిళనాడు గవర్నర్ల ఎదుట తన నృత్య ప్రతిభను చాటి, వారి అభినందనలు అందుకున్నట్లు గుర్తుచేశారు. ఇంజినీరింగ్ చదువుతూ కూచిపూడి నృత్యంలోనూ చక్కని ప్రతిభను ప్రదర్శించిన టీనా చౌదరి తెనాలికి గర్వకారణమని విజయశేఖర్ పేర్కొన్నారు. సైకాలజిస్ట్ శ్రీమన్నారాయణ, ఉమాదేవి, ఎంపీటీసీ అమ్మిశెట్టి ఆదినారాయణ, మన్నే సత్యనారాయణ, రవి అనిల్, శ్రీనివాసరావు, అప్పారావు మాట్లాడారు. తొలుత చిన్నారులు గ్రీష్మ, తహసీన్ చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

సమ్మర్ క్యాంప్ ప్రారంభం



తెనాలిటౌన్: కొలకలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 3, 4, 5 తరగతుల విద్యార్థులకు సమ్మర్ క్యాంప్‌ను ఉపాధ్యాయులు ప్రారంభించారు. ఆకులు, పేపర్లతో బొమ్మలు తయారీ, పొడుపు కథలు, సామెతలు, గుణింతాలతో పదాల కూర్పు తదితర వాటిని నేర్పించారు. విద్యార్థులకు మెటీరియల్‌ను స్కూల్ కమిటీ చైర్మన్ పినపాటి అనిల్‌కుమార్, ఉపాధ్యాయులు అందజేశారు. ఈ సందర్భంగా స్కూల్ కల్చరల్ సెక్రటరీ ఎం.అన్నారావు మాట్లాడుతూ వేసవిల్లో చిన్నారులు బయట తిరగకుండా స్కూల్లో తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి పంపించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అన్నారావు, లక్ష్మీనారాయణ, కృష్ణవేణి పాల్గొన్నారు.

దాసాంజనేయస్వామి జయంతి మహోత్సవాలు



ఆంజనేయస్వామికి తమలపాకులతో పూజ

తెనాలిటౌన్: గంగానమ్మ పేటలోని శ్రీ విద్యా పీఠంలో దాసాంజనేయ స్వామి జయంతి ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఆంజనేయస్వామికి గో క్షీరంతో అభిషేకం జరిపారు. లక్ష తమలపాకులతో బాలస్వామిజీ పూజలు చేశారు. హనుమాన్ చాలీసా పారాయణం, విశేష మంగళ హారతులు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. శ్రీ సాలిగ్రామ మఠం ట్రస్ట్ వైస్ ప్రెసిడెంట్ గుడివాడ శివప్రసాద్, జాయింట్ సెక్రటరీ ఎం.రమణయ్య, తటవర్తి శివ రామకృష్ణ, చుండూరు లోకనాథం, రామకృష్ణ, శ్రీరాంబాబు, శ్రీ విద్యాపీఠం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. మారీసుపేటలోని శ్రీ చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాల సందర్భంగా ఆంజనేయస్వామికి లక్ష అరటిపళ్లతో అలంకరణ చేసి, పూజలు చేశారు. లలితాగోష్ఠి వారిచే హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.

'పది' పరీక్ష ఫలితాలపై సమీక్ష

సప్లిమెంటరీ పరీక్షలపై హెచ్‌ఎంలకు డిప్యూటీ ఈఓ నిర్మల దిశానిర్దేశం



విద్యార్థిని దాక్షిణ్యకు బహుమతి అందజేస్తున్న ప్రియాంక, డిప్యూటీ ఈఓ నిర్మల

తెనాలి: తెనాలి డివిజన్‌లోని ఉన్నత పాఠశాలల పదో తరగతి పరీక్ష ఫలితాలపై ప్రధానోపాధ్యాయుల సమీక్షా సమావేశం శుక్రవారం స్థానిక తాలూకా జూనియర్ కాలేజ్, హైస్కూలులో నిర్వహించారు. తెనాలి ఉప విద్యాశాఖ అధికారిణి ఎం.నిర్మల పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను అభినందించారు. ఉత్తీర్ణతపై పాఠశాలల వారీగా ప్రధానోపాధ్యాయులతో సమీక్షించారు. పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో విద్యార్థులందరూ ఉత్తీర్ణులయ్యేలా ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయులు, తమ విద్యార్థులను పాఠశాలకు రప్పించాలని స్పష్టం చేశారు.

వారికి ప్రత్యేకంగా గైడ్ చేస్తూ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యేలా చూడాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సెలవుల్లో కూడా వాట్సాప్ గ్రూపులతో ప్రతి టీచర్ విద్యార్థులకు అందుబాటులో ఉంటూ రాబోయే విద్యా సంవత్సరం తరగతులకు సంసిద్ధపరచాలని సూచించారు. తెనాలి మండల విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎం.లక్ష్మీనారాయణ, దుగ్గిరాల ఎంఈవో కె.శ్రీనివాసరావు, బుర్రిపాలెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లలిత ప్రసాద్, ఈమని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.ఏడుకొండలు ప్రభృతులు పాల్గొన్నారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు హ్యాపీ హాస్పిటల్ తరపున డాక్టర్ పావని ప్రియాంక రిఫ్రెష్ మెంట్స్, బహుమతులను అందజేశారు. రెడ్‌క్రాస్, తెనాలి చైర్మన్ ముమ్మనేని భానుమతి పాల్గొన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులకు సత్కారం



తెనాలి: గత మార్చిలో జరిగిన సీబీఎస్‌ఈ ప్లస్ టూ పరీక్షల్లో స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని శ్రీ వివేకానంద సెంట్రల్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించినట్లు వివేక విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణ వెల్లడించారు. ప్లస్ టూ పరీక్షల్లో విద్యార్థులు ఎండీ ఆఫ్రిన్, సౌమ్యశ్రీ 94 శాతం మార్కులతో ఉత్తీర్ణులు కాగా, మెహక్ ఫాతిమా 92 శాతం, ఎ.మాధురి 90.2 శాతం మార్కులతో ప్రతిభను చాటినట్లు వెల్లడించారు. పరీక్షకు హాజరైన 64 మంది విద్యార్థుల్లో 62 మంది ఉత్తీర్ణులు కాగా, వీరిలో 22 మంది డిస్టింక్షన్ సాధించినట్లు తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను, వారి తల్లిదండ్రులను శుక్రవారం సాయంత్రం స్కూలులో సత్కరించి, జ్ఞాపికలు బహూకరించారు. సీబీఎస్‌ఈ పరీక్షల్లోనూ తమ విద్యార్థులు నూరుశాతం ఫలితాలను సాధించినట్లు డాక్టర్ వీరనారాయణ చెప్పారు. పరీక్షకు హాజరైన 70 మంది ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. కొడాలి శ్రీఅంజని, ఎస్.దీపిక ఇద్దరూ 95 శాతం మార్కులతో టాపర్లుగా నిలిచారని, దేవికాసాయి 94, నాగ ప్రజ్ఞ 93, రఘురాం, అబూబకర్‌లు 90 శాతం మార్కులతో ప్రతిభను చాటారని చెప్పారు. ఆర్.వెంకట్రామ్, ఈడీ డాక్టర్ కె.రామరాజు, ప్రిన్సిపల్ రమాదేవి, మురళీ పాల్గొన్నారు.

రోడ్ల విస్తరణ వేగవంతం చేయండి



పట్టణ ప్రణాళిక అధికారులతో సమావేశమైన కమిషనర్ చేకూరి కీర్తి

నెహ్రూనగర్: నగరంలో రోడ్ల విస్తరణ జరిగిన ప్రాంతాల్లో నిబంధనల మేరకు టీడీఆర్ బాండ్లు ఇవ్వడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారుల్ని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం పట్టణ ప్రణాళిక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో రోడ్ల విస్తరణ పనులు జరిగిన ప్రాంతాల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు మంజూరు చేయాల్సిన టీడీఆర్ బాండ్లు ఇంకా కొన్ని ప్రాంతాల్లో ఇవ్వలేదని, వాటిని వెంటనే ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏటీ అగ్రహారం పనులు వేగంగా జరగాలని, విస్తరణ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో ఇతర శాఖలతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. మీడియా డివైజ్ డిస్‌ప్లే ఫీజులు వసూళ్లు తక్కువగా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏసీపీల వారీగా ఈ నెలాఖరు నాటికి నూరు శాతం జరిగేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. రీ సర్వే వేగవంతం చేయాలని తెలిపారు. సమావేశంలో సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, డెప్యూటీ సిటీప్లానర్లు మూర్తి, కోటయ్య, ఏసీపీ అశోక్ కుమార్, టీపీఎస్‌లు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

కొమ్మూరు(కాకుమాను):మండలంలోని కొమ్మూరులో పేకాట స్థావరంపై గురువారం రాత్రి దాడి చేసి ఆరుగురు జూదరుల్ని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ రవీంద్ర శుక్రవారం తెలిపారు. వారి వద్ద రూ.3470ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుల్ని కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలియజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తెనాలిటౌన్: విద్యుత్ లైన్ల మరమ్మతులు జరుగుతున్నందున తెనాలి పట్టణం, రూరల్ మండలంలోని కొన్ని గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ బి.అశోక్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.